www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 డిసెంబర్ 2023

5

అన్నమయ్య

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతం

పరీక్షలను పర్యవేక్షిస్తున్న విద్యాశాఖాధికారి

రాయచోటి : 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా రాయచోటిలో మూడు కేంద్రాలు, రాజంపేటలో మూడు కేంద్రాలు, మదనపల్లిలో నాలుగు కేంద్రాలులో నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు రాయచోటి డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత (బాలికలు) పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షలను ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,496 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2,413 మంది హాజరయ్యారని, 83 మంది గైరు హాజరయ్యారని అన్నారు. జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- తెలంగాణ ప్రభుత్వానికి చెంపపెట్టు
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిరాజ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను చిన్న చూపు చూసిన తెలంగాణ ప్రభుత్వానికి ఎన్నికల ఫలితాలు చెంప పెట్టు లాంటివని, దీన్ని గుణపాఠంగా తీసుకుని మన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను స్వయంగా జోక్యం చేసుకుని పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణం లోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు - నేడుతో పాఠశాలల మౌలిక వసతులు మెరుగైనప్పటికీ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకుని వచ్చిన సంస్కరణల అమలుతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోయిందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ జిఒ117 అమలు కారణంగా వేలాది ఉపాధ్యాయ పోస్టులు మాయమైపోవడం, వేలాది పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడంతో లక్షలాది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రయివేట్ పాఠశాలలకు తరలి వెళ్లడం చూస్తుంటే ఈ ప్రభుత్వ విధానాలు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్లు రూఢి అయిందన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం చేయాలనే చిత్తశుద్ధి నిజంగా ప్రభుత్వానికి ఉంటే కామన్ స్కూల్ విధానం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి న్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలైన సిపిఎస్ రద్దు, సకాలంలో డిఎల చెల్లింపు, మెరుగైన పిఆర్‌సి, బోధనేతర పనుల విముక్తి తదితర అంశాలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని పేర్కొన్నారు. వాటిని అడిగితే నిర్బంధాలను ప్రయోగించడం, చిన్న చిన్న కారణాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం అత్యంత శోచనీయమన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రవి కుమార్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల హక్కులు హరించే ప్రభుత్వ చర్యలు ఆక్షేపణీయమని, వాటి సాధన కొరకు నిర్వహించే పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగంలోని మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో చర్చించి ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని ఎడల కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని పోరాటాలు కొనసాగిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉద్యమాలకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతుగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, జిల్లా కోశాధికారి చంద్ర శేఖర్, కార్యదర్శులు రమణయ్య, భాస్కర్ రెడ్డి, సుధాకర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, రమణ మూర్తి, అక్రమ్ బాషా, వెంకట రమణ, శ్రీధర్ రెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెంగల్ రాజు, రాజంపేట, మదన పల్లి, పీలేరు, రాయచోటి, వివిధ మండలాల యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతను క్రీడలలో ప్రోత్సహిస్తున్నాం

జిల్లా స్పోర్ట్స్ అధికారి జి.చంద్రశేఖర్

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో యువతీ, యువకులకు అందుబాటులో ఉంటూ క్రీడల తోపాటు యువతను అన్ని రంగాలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని జిల్లా స్పోర్ట్స్ అధికారి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో యువతీ, యువకులు ఆడదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ, క్రీడలలో వారిని ఎలా ప్రోత్సహించాలో, క్రీడాభివృద్ధికి ఆయన తీసుకుంటున్న చర్యలను ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో స్టేడియాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలోని రాజంపేటలో క్రీడా వికాస్ కేంద్రం (కెవికె) స్టేడియం ఉంది. రాయచోటి జిల్లా కేంద్రం అబ్బవరం గ్రామం నక్కా వాండ్ల పల్లె వద్ద 24 ఎకరాలలో కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే గడి కోట శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేస్తున్నారు. ఎప్పటికప్పుడూ పనులను వారు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నాం. జనవరి మొదటి వారంలో ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

స్పోర్ట్స్ అధికారుల పని వివరాలు తెలపండి?

జిల్లాలో యువతీ యువకులకు అందుబాటులో ఉంటూ అన్ని రకాల క్రీడలకు సంబంధించి సమ్మర్ కోచింగ్ క్యాంపులు కిట్లు పంపిణీ చేస్తాం. ఎక్కడైనా టోర్నమెంట్ జరుగుతూ ఉంటే వాటిని పర్యవేక్షించడం, క్రీడలు ఆడే వారిని గుర్తించడం, వారికి రాష్ట్రస్థాయి లో జరిగే కార్యక్రమాలకు పంపడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం.

'ఆడుదాం ఆంధ్ర' ఎప్పటి నుంచి ప్రారంభం అవుతుంది?

ఆడదాం ఆంధ్ర కార్యక్రమం ఆంధ్ర ప్రదేశ్‌లో మొట్టమొదటిసారి రాష్ట్రవ్యాప్తంగా క్రీడా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు, 15 సంవత్సరాలు పైబడిన యువతి యువకులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామ సచివాలయం, adudamandhara.ap.gov.in లోరఖాస్తు చేసుకో వచ్చు.

ఈ క్రీడలలో ఎలాంటి పోటీలు ఉంటాయి? ప్రభుత్వం ఏమైనా కిట్లు పంపిణీ చేస్తుందా?

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ వంటి క్రీడలు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ, సచివాలయం నందు క్రీడలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే దాదాపు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు సచివాలయాలకు క్రీడలకు సంబంధించిన కరపత్రాలు, కిట్లను పంపిణీ చేశారు. ఈ క్రీడల్లో గ్రామ స్థాయిలో సచివాలయం సెక్రటరీ, విఆర్ఒ, స్పోర్ట్స్ వాలంటరీ, పిడి, హెచ్‌ఎం, మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఇఒ హెచ్‌ఎం, పిడి, నియోజకవర్గస్థాయిలో ఆర్డీవో, సిఎస్ఒ, ఎంపిఒ, ఎంపీడీవో, ఎంఇఒ, పిడి, జిల్లా స్థాయిలో కలెక్టర్, జెసి, జిల్లా స్పోర్ట్స్ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. గ్రామ, సచివాలయ స్థాయిలో ఎంపికైన టీమ్‌నును, మండల స్థాయిలో ఎంపికైన టీమును నియోజకవర్గం స్థాయికి, జిల్లా స్థాయిలో ఎంపికైన టీమును రాష్ట్ర స్థాయికి పంపుతాం. వేర్వేరు స్థాయిల్లో బహుమతులుంటాయి.

యువతకు క్రీడలలో ఉపాధి కల్పిస్తున్నారు?

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలలో చురుగ్గా ఉన్న యువతీ యువకులను గుర్తించి ఫస్ట్ స్థాయి స్పోర్ట్స్‌కు ఎంపిక చేస్తాం. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి యువత, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

అధికార, ప్రతిపక్షాలు మేల్కోవాలి

- కరువు సహాయక చర్యలు చేపట్టని ప్రభుత్వం
- కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణమేదీ?
- ప్రజాప్రణాళికతో ఎన్నికల ప్రచారం
- విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ వెల్లడి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

బిజెపితో లోపాయికారీ పొత్తు ద్వారా వ్యతిరేక ఫలితాలు తథ్యమని తెలంగాణా ఎన్నికల ఫలితాలే రుజువు చేశాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వైఎస్‌ఆర్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి లకు తెలంగాణా ఎన్నికల ఫలితం కనువిప్పు కలిగించి ఉంటుందన్నారు. తెలంగాణాలో బిఆర్‌ఎస్ సర్కారు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నప్పటికీ ఓటమి పాలు కావాల్సి రావడాన్ని గమనించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంక్షేమాల్ని ఏదో ఒక్కదాన్ని నమ్ము కుంటే మునగడం ఖాయమని తేలిపోయిందని చెప్పారు. రాష్ట్రంలోని వైసిపి సర్కారు కూడా సంక్షేమ పేరుతో ముందుకెళ్తోందని, సంక్షేమం ద్వారా అధికారంలోకి రావాలనుకోవడం అసాధ్యమని తెలిపారు. ఎపిలో మార్పు రావడం తథ్యమన్నారు. అయితే టిడిపి స్వతంత్రంగా వ్యవహరిస్తే ఎన్నికల్లో ఫలితం లభిస్తుందన్నారు. బిజెపితో పొత్తు కారణంగా మైనార్టీ, ప్రొగ్రెసివ్, సెక్యులర్, డెమొక్రటిక్, అభ్యుదయ, శాంతికాముకులు, విద్యాధికారుల ఓట్లను నష్టపోతారని హెచ్చరించారు. బిజెపి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. పోలవరం మొదలుకుని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ వరకు అన్యాయం చేసిందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం సీట్లు కావాలని ఎవరినీ అడగ బోదని, బిజెపి వ్యతిరేక పార్టీలతో అవగాహన మేరకు ఎంపిక చేసుకున్న నియోజక వర్గాల్లో స్వతంత్రంగానే పోటీ చేస్తుందని ప్రకటించారు. అధికార వైసిపిని ఓడించాలంటే బిజెపితో సంబంధాల కారణంగా సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కరువు సహాయక చర్యలు లేవని విమర్శించారు. కడపలో ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ఉద్యమిస్తే జిందాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు చొరవ తీసుకున్నప్పటికీ, ఎటువంటి పురోగతి లేదన్నారు. వైఎస్ జగన్‌ను నమ్మి రాయలసీమ అత్యధిక సీట్లను కట్టబెట్టి మోసపోయిందని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి కల్పన అంశాల్లో నిరాశ పరిచిందన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రాన్ని మోసం చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి అడిగిన దాఖలాల్లేవని విమర్శించారు. రాష్ట్రంలో బటన్ నొక్కుడు ద్వారా ఇచ్చినట్లే ఇచ్చి, ఇసుక, మద్యం, వ్యాట్‌ల పేరుతో లాగుకుంటున్నారన్నారు. కడప జిల్లాలో లక్షల ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయని, బినామీల చెరలో ఉన్న భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరిన ఫిర్యాదును, ఫైలును మూలనపడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కూడా కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.60 పెట్రోల్, వంట గ్యాస్ రూ.400, నిరుద్యోగభృతి సైతం ఇవ్వొచ్చనే పేరుతో రూపకల్పన చేసిన ప్రజాప్రణాళికను అమలు చేస్తామనే పేరుతో ఎన్నికల్లో కి వెళ్తామన్నారు. ఈమేరకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి వ్యతిరేకంగా ఓట్లడగడానికి ప్రజాసంఘాలు ఇంటింటికీ వెళ్లే పనిలో ఉన్నాయన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి పాల్గొన్నారు.

చట్టసభల్లో బిసిలకు అవకాశం కల్పించాలి

మాట్లాడుతున్న బిసి చైతన్య సమితి అధ్యక్షులు రమణ

ప్రజాశక్తి - రాయచోటి

చట్టసభల్లో ఇప్పటికీ అడుగుపెట్టని బిసి కులాలకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బిసి చైతన్య సమితి అధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సాయి శుభ కల్యాణ మండపంలో కె.జీవానందం అధ్యక్షతన నిర్వహించిన రాజంపేట పార్లమెంటు బిసి శక్తి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టి.వెంకటసుబ్బయ్య, శివప్రసాద్ (గుట్టబాబు)ఇ.నాగేశ్వరరావు, నాగరాజు డి.నాగముని, రేపన శివప్రసాద్, కె.శివరాం, పి.నాగార్జున, రమేష్ ఎ.చంద్రశేఖర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ కుండలు తయారు చేసిన కుమ్మరులు, బట్టలు తయారు చేసిన సాలె బట్టలు ఉతికే రజక గడ్డం గీసే మంగలి భవనాలు నిర్మించే వడ్డెర ఇలా బిసి కులాలన్నీ సమాజానికి సేవ చేస్తున్నాయన్నారు. జనాభాలో సగం కంటే ఎక్కువ ఉన్న చాలా బిసి కులాలకు చట్టసభల్లో దశాబ్దాలుగా ప్రాతినిథ్యం లేకపోవడం శోచనీయమని అన్నారు. టి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్లు అందుకు అందుకు సహకరించాలని కోరారు. శివప్రసాద్(గుట్ట బాబు) మాట్లాడుతూ బిసి కులాలు ఏకతాటిపైకి వచ్చి తమ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎక్కడైతే బిసి అభ్యర్థి నిలబడతాడో వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బిసి చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి భద్ర, మదనపల్లె అధ్యక్షులు చిరంజీవి, తుమ్మలపల్లి నియోజకవర్గం అధ్యక్షులు గోపాల్, ఎపి వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి మల్లెల రెడ్డన్న, రియల్టర్ రాంప్రసాద్, రామచంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

ఫెలోషిప్‌కు 'మిట్స్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) విద్యార్థులు నలుగురు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రొగ్రామ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మునితనోజ్, లోకేష్, అయ్యస్వామి, బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని అమేయ శ్రీకసా, ధరిణి ఎంపికైనట్లు పేర్కొన్నారు. యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ ప్రోగ్రామ్‌ను స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం హస్సో పార్ట్‌నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ నిర్వహిస్తోందని చెప్పారు. డిజైన్, సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతతో క్యాంపస్ ఎంగేజ్‌మెంట్‌ను పెంచడానికి, విద్యార్థి నాయకులను ప్రోత్సహించేందుకు అమెరికా లోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వారు ప్రతి సంవత్సరమూ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు 2024 ఏప్రిల్ లో వారం రోజుల పాటూ నెదర్లాండ్‌లో నిర్వహించే కార్యక్రమం లో పాల్గొంటారని న్నారు. ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, ఇంటర్నేషనల్ సెల్ సీనియర్ మేనేజర్ యూ విజయ లక్ష్మి అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

జర్నలిస్టులకు ఉచిత ఇంటి స్థలాలు కేటాయించాలి

పీలేరు : జర్నలిస్టులకు ఉచిత ఇంటి స్థలాలతో పాటు వారి పిల్లలకు ఉచిత విద్యను అందించే జిఒ తీసుకు వచ్చేలా చూడాలని పంచాయితీరాజ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్ బాష ఎపి ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారులు అలీని కలిసి విన్నవించారు. మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రా రెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆయన హైదరాబాదులో ఆలీని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జర్నలిస్టులకు ఉచిత ఇంటి స్థలాలు, వారి పిల్లలకు ఉచిత విద్యకు సంబంధించిన జిఒ వీలైనంత త్వరగా అమలయ్యేలా చూడాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా 24/7 విధులు నిర్వర్తించే జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఆసరా ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు ఆలీకి పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. ఆలీని కలిసిన వారిలో పంచాయితీరాజ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్ బాషతో పాటు కల్లూరు అలీభై, వైసిపి సీనియర్ నాయకులు జీలానీ సాహెబ్, ఏఎంసి డైరెక్టర్ మునీర్, పంచాయతీ వార్డు సభ్యులు ఆబీద్ ఉన్నారు.

అలీని సన్మానిస్తున్న పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌దాస్‌చౌదరి

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి మాట్లాడుతూ రవీంద్రనాథఠాకూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు పరిశీలనలో అవకతవకలు చోటు చేసుకున్నాయని చెప్పారు. స్థానిక బిఎల్ఒలు నిష్పక్షపాకంగా వ్యవహరించాలని అన్నారు. ఓటర్ జాబితాలో చాలా వరకు ఒక బూత్ నుంచి మరొక బూత్‌కు ఓటర్‌ను మార్చడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. వాటిని సరిచేయకపోతే లక్షన్ కమిషన్‌కు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో ఎపిలో జనసేన, టిడిపి సంయుక్తంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు,రెడ్డెమ్మ, ఐటీ విభాగ నాయకులు లక్ష్మినారాయణ, చంద్రశేఖర, కుమార్, నవాజ్, జవిలి మోహన్ కృష్ణ, లవన్న, ఆదినారాయణ, జనర్దన్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

పెద్ద దర్గాను సందర్శించడం ఆనందంగా ఉంది

- ప్రముఖ సినీ హీరో నాని

ప్రజాశక్తి - కడప అర్బన్

దర్గాను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని న్యాచురల్ స్టార్ హీరో నాని అన్నారు. ఆదివారం పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు దర్గా నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను నానికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హాయ్ నాన్న' సినిమా ఈ నెల 7వ తేదీ విడుదల కాబోతుందని పేర్కొన్నారు. ప్రేక్షకులు, అభిమానులు తప్పకుండా ఆదరించాలని కోరారు. అంతకు ముందు విజయదుర్గాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద దర్గాలో ప్రార్థన చేస్తున్న హీరో నాని

వృద్ధురాలికి వినికిడి యంత్రం అందజేస్తున్న ఉదయమోహన్‌రెడ్డి

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి- మదనపల్లి

స్థానిక అమ్మచెరువు మిట్టలో గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సెక్రటరీ యం. ఉదయమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ డిసెంబర్ 3 నుంచి 9 వరకు వేడుకలు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు 30 వీల్ చైర్లు, 40 వినికిడి యంత్రాలు, 2ట్రై సైకిళ్లు, 60 చేతి కర్రలు60, ఎల్బో స్టిక్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో చిన్నారులు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం గురించి ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలు చేసి అందరిని అలరించారు. అనంతరం వారికి ప్రథమ, ద్వితీయ, త్రితీయ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపల్ పి. లీనకుమారి , సిబ్బంది , చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు

గొప్ప నాటక కర్త 'ముత్తరాజు'

కడప అర్బన్ : 'శ్రీకృష్ణతులాభారం'తో తెలుగునేలలో ముత్తరాజు సుబ్బారావు నాటకకర్తగా గొప్పకీర్తిని సంపాదించుకున్నారని ప్రముఖ రంగస్థల నటుడు యస్.నాగముని (మధుబాబు) పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, శ్రీ వేంకటేశ్వర సాంస్కృతిక మండలి సంయుక్తంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 'ముత్తరాజు సుబ్బారావు జీవితం - సాహిత్యం' అనే అంశంపై సదస్సును నిర్వహించాయి. ఈ సందర్భంగా కడప నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు యస్.నాగముని (మధుబాబు) ప్రసంగించారు. వ కార్యక్రమంలో వక్త యస్.నాగమునిని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ సత్కరించారు.

మార్కెట్‌యార్డులో నిల్వ ఉన్న మురుగునీటిని చూపుతున్న నాయకులు

మార్కెట్ యార్డులో పరిశుభ్రత శూన్యం : జనసేన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మార్కెట్ యార్డులో పారిశుధ్యం శూన్యమని జనసేన నాయకులు మన్నేరు సూరిబాబు, నంద్యాల హరి, గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం వారు వారు మార్కెట్‌యార్డు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజంపేట మార్కెట్ యార్డుకు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి కూరగాయలు కొనుగోలుకు ప్రతినిత్యం వందలాది మంది వస్తుంటారని, రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్టు ప్రధాన కేంద్రమని తెలిపారు. నిత్యం వందలాది మంది సందర్శించే మార్కెట్‌లో వర్షపు నీరు, మురుగు నీరు చేరి చెత్తా చెదారంతో కంపు కొడుతోందని అన్నారు. ఈగలు, దోమలు మార్కెట్టులోని వ్యాపారులు, కూలీలు, రైతుల అనారోగ్యానికి కారణమౌతున్నాయని ఆరోపించారు. మార్కెట్‌లో అపరిశుభ్రతపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు పిర్యాదు చేసినా ఫలితం శూన్యమని తెలిపారు. ఇప్పటికైనా మార్కెట్ లో దోమల నివారణ, మురుగు, పరిసరాల పరిశుభ్రత కోసం పురపాలక అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి -రాయచోటి

అన్నమయ్య జిల్లాపై 'మిచౌంగ్' తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ సూచనల మేరకు జిల్లాలోని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. రైల్వే కోడూరు, రాజంపేట, తదితర ప్రాంతాలలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సరోజారెడ్డి

'ఉజ్వల్ యోజన'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను నిరుపేదల సద్వినియోగం చేసుకోవాలని శ్రీ బాలాజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శీలం సరోజా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి, చౌటుపల్లి సచివాలయాల్లో చేసిన వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు కేంద్రప్రభుత్వం ఉజ్వల్ యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్, స్టౌవ్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. గతంలో ఉజ్వల్ యోజన పథకం కింద 502 కనెక్షన్లు పంపిణీ చేశామని వారికి రూ.300లు సబ్సీడి వర్తిస్తుందని, సబ్సీడీ రానివారు ఆధార్‌కార్డుతో గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించాలని తెలిపారు. మండల మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయదారులు పంట పొలాలు, మామిడి తోటలకు క్రిమిసంహార మందులు పిచికారి చేసుకోవడానికి డ్రోన్ సులభతరంగా ఉంటుందని తక్కువ ఖర్చుతో మందులు పిచికారి చేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో డ్రోన్ అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కార్యక్రమానికి వచ్చిన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఐసిడిఎస్, జడ్‌పిఎన్ఎఫ్ సిబ్బంది స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు పౌష్టికాహారం, పెట్టుబడి లేని వ్యవసాయం పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోనంపేట పిహెచ్‌సి వైద్యులు సిద్దయ్య, ఎంపిడిఒ వెంకట్రామిరెడ్డి, ఇఒపిఆర్డఇ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ చెన్నారాయుడు, వైస్ సర్పంచి రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని అనంతరాజుపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు ఎస్ఎస్ సలాం ఆకస్మిక మృతి చెందడంతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుమారుడు షఫీ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ సలాం మృతి వైసిపి పార్టీకి తీరనిలోటని పార్టీకి ఆయన చేసిన సేవలను మరవలేమని అన్నారు. ఆయన మృతికి వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ముక్కా మధుసూదన్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు హేమలవర్మ, టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మస్తాన్, ఎంపిటిసి మల్లికార్జునలు నివాళులర్పించారు.

ఘనంగా 'నరేన్' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చెన్నూరు

పోచంరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలు గుమళ్ళ సాయికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, జడ్‌పిటిసి ముదిరెడ్డి సుబ్బారెడ్డి అన్వర్ రాజు, జి.ఎన్ గుమ్మల మధుసూదన్‌రెడ్డి, గుమ్మల శివారెడ్డి భాస్కర్ రెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. గ్రామంలో అభిమానులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. రక్తదానం శిబిరం కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెడపల్లి గణేష్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, సౌరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, టిఎన్ మహేశ్వర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు మైనారిటీ నాయకులు, రమణా చంద్ర సీనియర్ నాయకులు, నిత్య పూజయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

చెన్నూరు : దళితవాడలో నివాసముంటున్న ఉంటున్న చెప్పాలి చెప్పలయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా తక్షణ సాయం కింద ఆదివారం రూ. 10 వేల ఆర్థిక సాయం ఎంపిపి చీర్లసురేష్‌యాదవ్ అందజేశారు. కుటుంబానికి రావాల్సిన రూ. లక్ష త్వరలోనే అందజేసాతమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధి గారి వెంకటసుబ్బయ్య, యువ నాయకులు, టిఎన్ చంద్రారెడ్డి, సుధాకర్ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

139 పరుగులకు సెంట్రల్ జోన్ జట్టు ఆలౌట్

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 23 మెన్ మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 39.2 ఓవర్లలో 139 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సూర్యవంశం 32 పరుగులు చేశాడు. జోన్ జట్టులోని మాధవ్ 5, జానీబాష 4 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 16.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ఆ జట్టులోని మనోజ్ రాజు 35 పరుగులు (నాట్ అవుట్) చేశాడు. సెంట్రల్ జోన్ జట్టులోని రూకేష్ బాబు మూడు వికెట్లు తీసుకున్నాడు.

సిఎం జగన్‌పై వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బిటెక్ రవి అరెస్టయిన తర్వాత అజ్ఞానంతో మాట్లాడడం సబబు కాదని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి సంబంధించి నువ్వు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, ఎపి పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పెద్ద కొడుకులా ఉంటూ నేనున్నానంటూ ఉన్న ఏకైక నాయకుడు సిఎం జగన్ అని పేర్కొన్నారు. బిటెక్ రవి శనివారం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సిఎం జగన్‌కు బంధువులే అన్నారు. నాలుగు పెట్టుకుని 40 కుటుంబాలు ఉండే వారిని విమర్శించడం ఏమిటని వారు ప్రశ్నించారు. పులివెందుల పట్టణ అభివృద్ధి చేసిన ఘనత వైయస్ కుటుంబానికే చెం దుతున్నారు. పులివెందులలో జగన్‌రెడ్డిని ఓడిస్తానని బిటెక్ రవి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. చంద్రబాబు దగ్గర పేరు తెచ్చు కునేందుకు ఈ ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. సొంత మండలం సింహా ద్రిపురంలో సర్పంచ్‌గా గెలవలేని వ్యక్తి నువ్వు సిఎంపైన విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. పులివెందుల అభివృద్ధి ఇంతగా జరుగుతుంటే సహ కరించాలే తప్ప.. నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఒక కేసు లో నిన్ను పోలీసులు అరెస్టు చేస్తే దాన్ని సిఎంపై మోపడం సిగ్గు చేట న్నారు. రాష్ట్ర అభివృద్ధి, పులివెందుల అభివృద్ధిపై కానీ బహిరంగ చర్చకు రావాలని టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ మాట్లాడారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, రసూల్, డేనియల్, రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి : ఎంపీ

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విభిన్నప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 839 మంది విభిన్నప్రతిభావంతులకు ఎంపీ నిధులతోపాటు కేంద్ర సాధి కారత మంత్రిత్వ శాఖ ఎడిఐపి పథకం కింద పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతి భావంతులు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ వంతు కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సచి వాలయ పరి ధిలో విభిన్నప్రతి భావంతులను గుర్తించి ప్రభుత్వం వారికి అవ సరమైన పరి కరాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రత్యేక అవసరాలు గల వారిని కూడా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్‌డిఒ వెంకటరమణ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, అన్ని మండలాల ఎంపిపిలు, జడ్పిటిసిలు ఎంపీడీఓలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి : టిడిపి

ప్రజాశక్తి- వీరబల్లి

టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు మండలంలోని సానిపాయి గ్రామంలో బూత్ నెంబర్ 233,234 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బిఎల్‌ఒల దగ్గర ఉన్న ఓటరు లిస్టును అయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ డ్రాఫ్ట్ ఓటరు లిస్టును పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈ ప్రత్యేక శిబిరాలలో తెలియచేసి సరి చేసుకోవాలని తెలిపారు. 2024 జనవరి,1 తేదీ నాటికి 18 ఏళ్ళ నిండిన యువతను ఓటునమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, సీనియర్ నాయకులు జయరామ్‌యాదవ్, తెలుగు యువత పార్లమెంట్ కార్యదర్శి నేతిరమేష్ బాబు, చలపతినాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పుల్లేని ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 2, 3వ తేదీలలో నిర్వహించిన ఓటర్ లిస్టు వెరిఫికేషన్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి మండలంలోని రాచవేటివారి పల్లి గ్రామానికి సంబంధించిన పోలింగ్ బూతులు 199, 200, 201 కి సంబంధించిన

వీరబల్లి : బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్‌రాజు

నిమ్మనపల్లి : ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్‌జె వెంకటేష్

ఓటర్ లిస్టులను రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్, బూత్ ఇన్‌ఛార్జి శంకరతో కలిసి పరిశీలించారు. 201వ పోలింగ్ బూత్‌కు సంబంధించిన ఓటర్ లిస్టు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా లేదని చెప్పారు. ఓటర్‌లిస్ట్‌లో ఓట్లు క్రమ పద్ధతిలో లేకుండా ఉన్నాయని, ఊరు మరియు ఇంటి నెంబర్ల వారీగా సరిచేయాలని ఇదివరకే నిమ్మనపల్లి తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తహసిల్దార్ మంజుల ఫారం-8 ద్వారా వాటిని క్రమ పద్ధతిలో సరి చేస్తామని, ఇంతవరకు సరి చేయలేదన్నారు. 201 దిగువమాచిరెడ్డిగారిపల్లి పోలింగ్ బూత్ బిఎల్‌ఒకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి ముసాయిదా ఓటర్ లిస్టును సరిచేయాలని అన్నారు. దొంగఓట్లు నమోదుపై టిడిపి పోరాటం చేస్తుందని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు తప్పులు లేని ఓటర్ లిస్టును అధికారులు సిద్ధం చేయాలని కోరారు. **గాలివీడు:** డిసెంబర్ 9న ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తవుతుందని తహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. జనవరిలో కొత్త జాబితా ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు ఆదివారం పిఎస్ 186 బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో 917 ఓట్లు ఉండగా అందులో ఇప్పటికి చనిపోయిన వారిని, గ్రామంలో లేని వారి పేర్లు తొలగించినట్లు తెలిపారు. ఆదివారం 16 ఓటర్ల నమోదు అయినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు వెంకటేశ్వర్లు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

'యువతా.. ఓటు నమోదు చేసుకో'

ప్రజాశక్తి-వీరబల్లి

ఓటుహక్కు వజ్రాయుధమని 18 ఏళ్లు నిండిన యువత ఓటుహక్కును నమోదు చేసుకోవాలని తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి జాబితాలను రూపొందించాలని బిఎల్‌ఒలను ఆదేశించారు. మండలంలోని 34 పోలింగ్‌బూత్ కేంద్రాలను మూడు టీమ్‌లుగా బయలుదేరి పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించారు. వలస ఓటర్లను గుర్తించి ఆధార్ కార్డులోని చిరునామా ఆధారంగా వారి ఓట్లు ఎక్కడున్నాయో పరిశీలిం చాల న్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపి, జూనియర్ అసిస్టెంట్ ఆనంద నాయక్, సూపర్వైజర్ పెంచలయ్య, విఆర్‌ఒ కవిత పాల్గొన్నారు. **పుల్లంపేట :** రాష్ట్రంలోని ఓట్ల చేర్పులు మార్పులపై వస్తున్న కథనాలపై ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో సమగ్రమైన విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తహశీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంబంధిత అధికారులతో మిళితమైన బిఎల్‌ఒలు బూత్‌లెవెల్‌లో సమగ్రమైన విచారణ చేపట్టాలని తెలిపారు. అనంతపల్లి పంచాయతీ బూత్ నెంబర్ 195ను పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు చేపట్టడం జరుగుతుందని అంతేకాకుండా ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్‌కుమార్, బిఎల్‌ఒ కల్పన, విఆర్‌ఎ శివయ్య, శ్రీను పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల,సిద్దవరం, బండమీదపల్లి, వెలిగల్లు, ఎన్‌ఒపల్లి, పాపేపల్లి, సి.గొల్లపల్లి పంచాయతీ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను

వీరబల్లి : ఓటర్‌లిస్టు చూపిస్తున్న తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి



కలికిరి : ఓటురు జాబితాను పరిశీలిస్తున్న తహశీల్దార్

పెద్దమండ్యం తహశీల్దార్ రాము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో17 పంచాయతీ లో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాల లో ఓటర్లు జాబితాలో మృతిచెందిన వారిని తొలగించడం జరుగునని, 18 సంవత్సరాల పూర్తయిన వారికి ఓటర్లు జాబితాలోకి నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్వేజర్, హసీనా తాజ్, రమేష్, గౌరీశంకర్ , బిఎల్‌ఒలు ,ఓటర్లు పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను స్థానిక తహశీల్దార్ భాగ్యలత తనిఖీ చేశారు. రెండు రోజులు పాటు ఓటరు నమోదు, సవరణలు, ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేయడం ద్వారా 210 దరఖాస్తుల అందినట్లుతెలిపారు. అందులో ఎక్కువగా ఫామ్-6 143, ఫామ్-7 9, ఫామ్-8 58, వచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో బిఎల్‌ఒలు, విఆర్‌ఒ శ్రీనివాసులు, పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ ఆదేశాలు మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఓటర్ జాబితా ప్రత్యేక పరిశీలనలో భాగంగా బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఓటర్ జాబితాను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలు మేరకు ఓటరు జాబితాలోని దొర్లిన తప్పులను సరిచేయాలన్నారు.ముఖ్యంగా మృతిచెందిన వారి ఓట్లు తొలగింపు, చిరునామా మారిన ఓటర్లను సవరించాలన్నారు. ఓటర్ జాబితా రూపొందించడంలో బిఎల్‌ఒలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యూనిట్ ఇన్‌ఛార్జి సమీవుల్లా, బూత్ ఇన్‌చార్జి శిల్పా అంజి, కాశిపల్లి నరసింహులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రెడ్డివారిపల్లె మార్గంలో వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మధ్యాహ్నం రెడ్డివారిపల్లె మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డులో తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి బారికేడ్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ రాగల 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అత్యవసర సమయాల్లో తప్ప బయటకు రావద్దని ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు, వైసిపి శ్రేణులు అందరూ అందుబాటులో ఉండాలని కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఉప సర్పంచ్ తోట శివ సాయి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

జగన్ పాలన నచ్చక టిడిపిలోకి వలసలు

టిడిపి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో జగన్ పాలన నచ్చక వైసిపి నుంచి వలసలు వస్తున్నారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బక్కన్నగారిపల్లెలో ఆదివారం టిడిపి నాయకుడు గణేష్ నాయక్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిటెక్ రవి పాల్గొన్నారు. బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన గువ్వల నాగ సుబ్బయ్య, మురళి, సుధాకర్, దుపాటి మహేష్, కఠమయ్య, శ్రీరాములు నాయక్, రవికుమార్, చిన్నబాబు, బండి ప్రసాద్, మహేంద్ర, అనందుల్లా, బక్క మల్లయ్య, రాజగోపాల్, మరి కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి బిటెక్ రవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలోని బక్కన్నగారిపల్లెలో వైసిపి నుండి టిడిపిలోకి 20 కుటుంబాలు చేరినట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలో వైసిపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత చాలా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజల కోరిక మేరకు సెల్ టవర్ వేస్తానని బిటెక్ రవి హామీ ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా టిడిపి నాయకులు, కార్యకర్తలు భయపడరని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, మైనార్టీ నాయకుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఎస్పీ జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, వెంకటసుబ్బారెడ్డి, అబ్దుల్, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, పలువురు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. **దువ్వూరు :** మండల పరిధిలోని భీమునిపాడు గ్రామానికి చెందిన కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి, పెద్దబోయిన పెద్ద పామిలేటి, గంగరాజు, నూతేటి నాగేశ్వరయ్య, సుబ్బారెడ్డి, నవనీస్వర్‌రెడ్డి వారి అనుచరులు సుమారు 60 కుటుంబాలు మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై విసుగుచెంది టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. టిడిపిలో చేరిన వారందరికీ పార్టీ తాను ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. త్వరలో మనకు కూడా నియంత పాలన పోతుందని తెలిపారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంపై ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. టిడిపి ప్రభుత్వం అంటే అన్నదాత ప్రభుత్వమన్నారు. రానున్నఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, మైదుకూరు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కారపురెడ్డి సంజీవరెడ్డి, మండల నాయకులు, టిడిపి కార్యకర్తలు, కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విభిన్న ప్రతిభావంతులు

విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో జీవించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా మనోధైర్యంతో జీవించాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు సుబ్బనరసారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భముగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యాన్ని కోల్పోకుండా సామాన్యులకు ఏమాత్రము తీసిపోకుండా జీవించాలని తెలిపారు. ప్రభుత్వం స్వయం శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి వారు జీవించడానికి అవసరమైన వసతులను కల్పించాలని అన్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు బ్యాక్ లాగ్ ద్వారా ఉద్యోగ నియామకాలు త్వరగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహిద్, నరసిం హులు, జనరల్‌సెక్రెటరీ అబ్దుల్‌మజీద్, మురళీ, అంజద్, మణి పాల్గొన్నారు.

ఎద్దు దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఎద్దుదాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లి పంచాయతీ గొల్లపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు కదిరప్ప(45) తన ఎద్దులను మేతకోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. అక్కడ ఎద్దులను అదిలించే ప్రయత్నం చేయగా, ఒక్కసారిగా ఎద్దు కదిరప్పపై దాడిచేసింది. అతను గాయపడగా, స్థానికులు గమనించి వెంటనే బాధితుడని చికిత్స కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైసిపిలో 40 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, ఇందిరానగర్‌లకు సంబంధించిన 40 కుటుంబాలు ఆదివారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద దండే రవి ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - చాపాడు

రైతు సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై ఎపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. ఆదివారం రైతు సేవా సమితి సభ్యులతో కలిసి మైదుకూరు మండలం వనిపెంట ప్రాంతంలో తెలుగుగంగ పంట కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయినప్పటి నుంచి గత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు సహాయం చేయడంలో, పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తి కోసం నిధులు కేటాయించడంలో చాలా దారుణంగా వ్యవహరి స్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చి వ్యవసాయం దండగ అని రైతును నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కులాల పేరుతో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి రైతును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, మండల నాయకులు నాను బాల శివయ్య, ఆవుల నాగేష్, పోలయ్య, ఎస్‌బి శేఖర్ పాల్గొన్నారు.

వాలంటీర్ల జీతాల్లో కోత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వాలంటీర్లకు సంబంధించిన జీతాల్లో అధికారులు కోత విధించినట్లు తెలిసింది. వేంపల్లె మండల వ్యాప్తంగా దాదాపు 160మందికిపైగా అయా గ్రామాల్లో వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరు ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు చేర వస్తుండడంతో వారికి ప్రభుత్వం పారితోషికం ఇస్తోంది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయకు విచ్చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు సిఎం విధుల్లో పాల్గొనాలని అధికారులు ఆదేశాలిచ్చారు. వీరిలో కొందరు వాలంటీర్లు మాత్రమే సిఎం విధులకు హాజరయ్యారు. హాజరుకాని వాలంటీర్లుకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా దాదాపు 100 మంది జీతాల్లో రూ.1000 నుండి రూ.1200 వరకు అధికారులు కోత విధించినట్లు సమాచారం. జీతాల్లో కోత విధించడంతో కొందరు వాలంటీర్లు బహిరంగంగా అక్కడక్కడ ఈ విషయం చెప్పుకొని బాధపడుతున్నారు. గతంలో సచివాలయల్లో వృద్ధాప్య పింఛన్లలో అవినీతి చేసిన సిబ్బందిపై ఎలాంటి చర్యలు లేవు.. కానీ అతి తక్కువ గౌరవ వేతనంతో పని చేస్తున్న వాలంటీర్లు వేతనాల్లో అధికారులు కోతలు ఏమీటని వారు వాపోతున్నారు. వేతన కోతల్లో అధికారులు ఒకరిపై ఒకరు వేసుకోవడంతో మధ్యలో తాము నష్ట పోతున్నామని పలువురు వాలంటీర్లు పేర్కొంటున్నారు. దీనిపై ఎంపిడిఒ దివిజాను వివరణ అడగ్గా.. తాను ఇటీవల ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించానని, జీతాల్లో కోత తనకు తెలియదన్నారు. దీనిపై కిందిస్థాయి అధికారులతో చర్చిస్తామని వివరించారు.

మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో అంగవైకల్యంపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా సిఒ వసంత్ మాట్లాడుతూ మేనరిక పెళ్లిళ్ల ద్వారా పుట్టబోయే పిల్లలు అంగవైకల్యంతో జన్మించే అవకాశం ఉందన్నారు. పౌష్టికాహార లోపంతో పోలియో వంటివి సంక్రమిస్తున్నాయని, పిల్లలు అంగవైకల్యం బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

ప్రజాశక్తి-మదనపల్లి

తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపుపై మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి యస్.రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బెంగుళూరు బస్టాండ్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో మండల నాయకులు సురేంద్రరెడ్డి, ముభారక్ ఖాన్ బాషా, గంగులప్ప, మహబూబ్ పీర్, శరత్ కుమార్ రెడ్డి, రవి, మహమ్మద్‌అలీ, తలారీ వెంకటరమణ పాల్గొన్నారు. **విసికె పార్టీ ఆధ్వర్యంలో..** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై విసికె పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ హర్షం ప్రకటించారు. వీరోచితంగా పోరాడి తెలంగాణలో దొరలపాలనకు చరమగీతం పాడిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలకు అభినందనలు తెలియజేశారు. **పుల్లంపేట :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో రైల్వేకోడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సిసెల్ కన్వీనర్ శాంతయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొనిరెడ్డి ప్రతాపరెడ్డి, ఓబులవారిపల్లి మండల అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి, పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాలరమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ, బిసి నాయకులు చాంద్‌బాషా పాల్గొన్నారు.



మదనపల్లి : మిఠాయిలు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు